క్లుప్తంగా

సీఎంను కలిసిన కాంగ్రెస్ నేత



సీఎం రేవంత్‌రెడ్డితో బోధ మాధవరెడ్డి, వెంకట్రామిరెడ్డి

మహేశ్వరం: పీసీసీ కార్యదర్శి బోధ మాధవ రెడ్డి, ఆయన కుమారుడు బోధ వెంకట్రామిరెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఐటీ పరిశ్రమలను స్థాపించి, శ్రీశైలం జాతీయ రహదారిని మరింత అభివృద్ధి చేయాలని సీఎంను వారు కోరారు.

శానిటేషన్ సిబ్బందికి నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ రఘు, పలువురు కార్పొరేటర్లు మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. శానిటేషన్ సిబ్బందికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిబ్బందితో పాటు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మేయర్‌కు సన్మానం



మేయర్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: ప్రపంచ మేయర్ల ఫోరం సమావేశానికి ఇండోనేషియాలోని జకార్తా వెళ్లిన బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి విజయవంతంగా సభల్లో పాల్గొని వచ్చిన సందర్భంగా మంగళవారం మున్సిపల్ కార్పొరేటర్లు ఆమెను సన్మానించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ప్రణాళికలు ప్రపంచ దేశాలకు వినిపించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో యువత పాల్గొనాలి

మన్సూరాబాద్: తలసేమియా చిన్నారులను ఆదుకుందామని జై భారత్ జాతీయ కార్యదర్శి సత్యనారాయణ గోల పిలుపునిచ్చారు. ఎల్‌బీనగర్‌లోని జైభారత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జై భారత్ పూర్వ జాతీయ అధ్యక్షుడు ఖదిజ్ఞాసీ అజాద్ షేక్ 7వ వర్ధంతిని పురస్కరించుకుని ఎల్‌బీనగర్ సూర్యోదయ నగర్ కాలనీలోని జై భారత్ కార్యాలయం ఖల్సాభవన్‌లో బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో హాజరై రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9848030089, 9849995538 నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలోని మౌలిక సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిద్దిటమే నా ప్రధాన లక్ష్యమని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని దుర్గభవానీనగర్, యాదగిరినగర్ కాలనీలలో త్వరలో ఏర్పాటు చేయన్ను సీసీ రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలలో అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు స్థానిక కాలనీవాసులకు కొంతమేర ఇబ్బందులు తలెత్తుతాయని కాలనీ వాసులు సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సభ్యులు వెంకట్, కృష్ణ, ప్రభాకర్, నాయకులు శ్రీనివాస్‌నాయుడు, సుమిత్, వినోద్ పాల్గొన్నారు.

సిబ్బంది కొరత.. తప్పని తిప్పలు!

లావాదేవీలకు గంటల తరబడి ఎదురుచూపు

- ఎస్‌బీఐలో సిబ్బందిని నియమించాలంటున్న ఖాతాదారులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

కందుకూరు: సిబ్బంది కొరతతో సేవలు వేగంగా అందక బ్యాంక్ ఖాతాదారులకు తిప్పలు తప్పడం లేదు. గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారి లావాదేవీలో భాగంగా తమ సమయం వచ్చినప్పుడు మాత్రమే నగదు డిపాజిట్ చేయడం లేదా తీసుకోవడం, ఇతర పనులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ లావాదేవీలు ఆలస్యమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. ఇది కందుకూరు చౌరస్తాలోని ఎస్‌బీఐ శాఖ పని తీరు.

అవస్థలు పడుతున్న ఖాతాదారులు..

కందుకూరు చౌరస్తా శ్రీశైలం రహదారిపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉంది. ఈ శాఖ పరిధిలో దాదాపుగా మండల పరిధిలోని అధిక గ్రామాలు వస్తాయి. ఆ బ్యాంక్‌లో సుమారుగా 25 వేలకు పైగా ఖాతాదారులు ఉన్నారు. 350 వరకు డ్వాక్రా సంఘాలకు అక్కడే ఖాతాలు ఉన్నాయి. దీంతో పాటు భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన చలాన్లు ఇక్కడే తీసుకోవాలి. ప్రభుత్వ కార్యాలయాలకు ఇక్కడే ఖాతాలు ఉన్నాయి. దీంతో బ్యాంక్‌లో నిత్యం ఖాతాదారులతో కిటికిటలాడుతుంది. ఆ బ్యాంక్‌లో మేనేజర్, అకౌంటెంట్, ఫీల్డ్ ఆఫీసర్‌తో పాటు మరో ఇద్దరు క్లర్కులు మాత్రమే పని చేస్తున్నారు. దీంతోనే సమస్య అంతా. బ్యాంక్ కార్యకలాపాలకు తగ్గట్లుగా ఇక్కడ సిబ్బంది లేరు. ఉన్న సిబ్బంది తమ విధి నిర్వహణలో నానా అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి ఖాతాదారులు నిలబడి డిపాజిట్లు, నగదు ఉప సంహరణతో పాటు ఇతర లావాదేవీలు చేసుకోవాల్సి వస్తుంది. దీంతో ఒక్కోసారి సిబ్బందిపై ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేసినా సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇంత పెద్ద ఎత్తున ఆ శాఖలో లావాదేవీలు జరుగుతున్నా ఆ బ్యాంకు ఉన్నతాధికారులు అదనంగా సిబ్బందిని కేటాయించకపోవడం, ఏర్పాటు చేసుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ఉన్న సిబ్బంది అదనపు సమయం పనులు చేస్తున్నా, సకాలంలో పనులు పూర్తి చేయలేకపోతున్నారు. చాలా ఒత్తిడితో పనులు చేయాల్సిన పరిస్థితి వారికి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అదనంగా సిబ్బందిని నియమించాలని ఖాతాదారులు కోరుతున్నారు.



కందుకూరులో ఎస్‌బీఐ శాఖ

ఇబ్బందిగా ఉంది



ఎస్‌బీఐ శాఖలో నగదు డిపాజిట్ చేయాలన్నా, తీసుకోవాలన్నా గంటల తరబడి నిలబడాల్సిందే. ఒక్కోసారి అంతసేపు నిరీక్షించాలంటే ఇబ్బందిగా ఉంది. దీంతో అత్యవసరమైతేనే బ్యాంక్‌కు వస్తున్నాం. లేకపోతే ఏదోలా లావాదేవీలు చేసుకుంటున్నాం.

– ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఖాతాదారు, కందుకూరు

పని ఒత్తిడి ఎక్కువ



కందుకూరు ఎస్‌బీఐ శాఖలో సిబ్బంది సంఖ్యను పెంచాలి. ప్రస్తుతం ఆ శాఖకు వెళ్లి లావాదేవీలు చేయాలంటే భయపడాల్సి వస్తుంది. చాలా సేపు నిరీక్షించి పనులు పూర్తి చేసుకోవాల్సి వస్తుంది. అక్కడి సిబ్బందికి పని ఒత్తిడి ఎక్కువగా ఉంది.

– కె.వెంకటేశ్వర్లుగుప్తా, వ్యాపారస్తుడు, కందుకూరు

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రాజశేఖర్



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజశేఖర్

మహేశ్వరం: మహేశ్వరం మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఎ.రాజశేఖర్ మంగళవారం కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పని చేసిన తహసీల్దార్ విజయలక్ష్మి లాంగ్ లీవ్ పెట్టడంతో, జిల్లా కలెక్టర్ శశాంక్ మండలానికి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రాజశేఖర్‌ను నియమించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న భూ సమస్యలను త్వరితగతంగా పరిష్కరిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించి రైతులకు మేలు చేస్తామన్నారు. రెవెన్యూ రికార్డుల సవరణ, విద్యార్థులకు కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలను సకాలంలో అందిస్తామన్నారు. మండలంలో ఉన్న ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆ భూముల్లో ప్రభుత్వ బోర్డులు పెట్టిస్తానన్నారు. మండలంలో ప్రభుత్వ, అసైన్డ్ భూములు, శిఖం, సీలింగ్ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. రాజశేఖర్ ఇదివరకు గండిపేట తహసీల్దార్‌గా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్(యూఎల్‌సీ) సెక్షన్‌లో తహసీల్దార్‌గా విధులు నిర్వహించి మహేశ్వరం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వచ్చారు.

కొనసాగుతున్న వారాహి దేవి నవరాత్రులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కెపురంలోని కుర్తాళం పీఠ శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరంలో శ్రీ వారాహి దేవి నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం అమ్మవారి ఆలయంలో ప్రత్యంగిరా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో కుంకుమార్చనలు, శ్రీ సౌందర్య లహరి పారాయణము ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ సుబ్రహ్మణేశ్వర హోమం, నాగదోష, కాలసర్ప దోష, కుజ దోష, నివారణార్థం, శ్రీ వారాహి ప్రత్యేంగిరా సహిత, శ్రీ వల్లీ దేవాసేనా శ్రీసుబ్రహ్మణేశ్వరస్వామి మంత్ర విశేష హోమలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, విఠల్ శర్మ ,సాయి కుమార్ శర్మ , అరుణ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా పనిచేశా: మాజీ సర్పంచ్ యాదగిరి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ నడికుడి యాదగిరి

బడంగ్‌పేట్: స్వార్థపు ఆలోచనలు లేకుండా గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఆర్మీని వదిలిపెట్టి ఊరికి నిస్వార్థంగా సేవలు అందించిన తనపై కక్షకట్టుకుని ఆరోపణలు చేయడం సరికాదని బడంగ్‌పేట మాజీ సర్పంచ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోకన్వీనర్ నడికుడి యాదగిరి అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీలో సేవలు అందిస్తూ బడంగ్‌పేట కార్పొరేషన్‌కు తనవంతుగా కృషి చేస్తున్న తనపై మాజీ సర్పంచ్, 28వ డివిజన్ కార్పొరేటర్ సూర్ణగంటి అర్జున్ అవినీతి ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 20 ఏళ్ల క్రితం సర్పంచ్‌గా చేసిన తన ఆస్తులు ఇప్పటికీ ఒక్క గజం పెరగలేదని గుర్తు చేశాడు. నాడు కొత్తగా వెంచర్లు ఏర్పడితే గ్రామ పంచాయతీకి వదిలివేసిన స్థలాలను గ్రామ పంచాయతీ పేరుతో రిజిస్ట్రేషన్లు చేయించానని డాక్యుమెంట్లు చూపించారు. 15 ఏళ్ల క్రితం సర్పంచ్‌గా చేసిన నీకు వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో నిరూపించాలని సవాల్ విసిరారు. ఇతరుల మీద బురదజల్లడం మానుకోవాలన్నారు. సప్తగిరి కాలనీలో కూల్చిన చోటే తిరిగి గణేశ్ మండప నిర్మాణం చేపడుతామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

సర్కార్ బడులు బలోపేతం చేసే దిశగా చర్యలు

మలక్‌పేట: సర్కార్ బడులు బలోపేతం అయ్యే విధంగా చర్యలు చేపడుతున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మంగళశారం ఆయన విద్యాశాఖ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని సర్కార్ బడులలోని సౌకర్యాలు, ఒకే ప్రాంగణంలో ఉన్న పాఠశాలల నిర్వహణపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్కార్ బడులను బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో ఇంకా మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హైద్రాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి, సైదాబాద్ మండల డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ, హిమాయత్‌నగర్ డిప్యూటీ ఈఓ విజయలక్ష్మి, చార్మినార్ డిప్యూటీ ఈఓ నెహ్రూబాబు, డిప్యూటీఐఓఎస్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం



మీర్‌పేట: బాలాపూర్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మహేశ్వరం: విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాడుతుందని ఏబీవీపీ మహానగర కార్యదర్శి బి.శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో జాతీయ భావాలను పెంపొందిస్తూ జాతీయ నిర్మాణమే లక్ష్యంగా ఏబీవీపీ పని చేస్తోందన్నారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను గుర్తిస్తూ వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా పని చేస్తోందన్నారు. భవిష్యత్‌లో విద్యార్థుల పక్షాన మరిన్నీ ఉద్యమాలు చేపడుతామన్నారు. అంతకుముందు ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీరపట్నం జిల్లా కన్వీనర్ సాయిచరణ్, మహేశ్వరం నగర కార్యదర్శి రాఘవేందర్, సంయుక్త కార్యదర్శి దుర్గాప్రసాద్, విద్యార్థులు సహిద్, ధనుష్, శ్రీకాంత్, ప్రవీణ్, అఖిలాశ్, లకాన్, ప్రణీత్, రోహిత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు: ఏబీవీపీ జిల్లా స్టూడెంట్ ఫర్ సేవ కన్వీనర్ అనేగాని సాయికిరణ్ ఆధ్వర్యంలో మంగళవారం కందుకూరు చౌరస్తాలో జెండా ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ఢిల్లీ భానుప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ మణికుమార్, ఏబీవీపీ నాయకులు అనిల్‌కుమార్, రాహుల్, రాజేశ్, విష్ణు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట: విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై పోరాటం చేసేందుకు ఏబీవీపీ నింతరం కృషి చేస్తుందని భాగ్యనగర్ వ్యవస్థ ప్రముఖ్ రామినేని శ్రీకాంత్‌జీ తెలిపారు. బాలాపూర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మీర్‌పేట బాలాపూర్ చౌరస్తాలో కళాశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు చౌరస్తాలో ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ అక్యారి మహేశ్, విద్యార్థి నాయకులు మహేశ్, రమావత్ సతీశ్, గంగాధర్, మధు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు చౌరస్తాలో..



ఇబ్రహీంపట్నంలో జెండావిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

రహదారి ఇలా వెళ్లేదెలా?

పట్టించుకోని అధికారులు

మీర్‌పేట: చినుకు పడితే వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని సిర్లాహిల్స్ చౌరస్తా నుంచి పెద్ద చెరువునకు వెళ్లే దారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఆ దారిపై నీరు చేరి రాకపోకలకు ఆటంకంగా మారుతుంది. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో వాహనదారులు ఇతర మార్గం నుంచి ప్రయాణించాల్సి వస్తోంది. దీనికి తోడు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రయాణం ఇబ్బందిగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. పెద్ద చెరువు కట్ట రహదారిని అభివృద్ధి చేసిన అధికారులు, ప్రజల అవస్థలను గుర్తించి ధ్వంసమైన రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సిర్లాహిల్స్ చౌరస్తా నుంచి పెద్ద చెరువు వైపునకు వెళ్లే దారిలో చేరిన నీరు

సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా తానాజీ పాటిల్



నియామకపత్రం అందుకుంటున్న తానాజీ పాటిల్

హుడాకాంప్లెక్స్: ఓబీసీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా మోండేకార్ తానాజీ పాటిల్ నియమితులయ్యారు. మంగళవారం ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మీ తానాజీకి నియామక పత్రం అందజేశారు. క్షత్రియ సమాజ్ అధ్యక్షుడైన తానాజీ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి చేస్తున్న కృషిని గుర్తించి పదవికి ఎంపిక చేసినట్లు భాగ్యలక్ష్మీ తెలిపారు. అనంతరం తానాజీ పాటిల్ మాట్లాడుతూ ఓబీసీలను ఏకతాటిపై నిలిపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యక్షుడిగా నియమించిన భాగ్యలక్ష్మీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చిరువ్యాపారులకు కేటాయించండి

కడ్తాల్: మండల కేంద్రంలో పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను చిరువ్యాపారులకు కేటాయించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నాయకులు, యువకులు, చిరువ్యాపారులతో కలిసి పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ రాధికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో రూ.46 లక్షల వ్యయంతో తెలంగాణ పాడిపారిశ్రామిక అభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. నిర్మాణం పూర్తయి రెండు సంవత్సరాలు గడిచినా నేటికి వాటిని కేటాయించకపోవడం బాధాకరమన్నారు. షాపింగ్‌కాంప్లెక్స్ భవనాలను త్వరగా ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా దుకాణ సముదాయంలో ఒక దుకాణాన్ని మహిళా సమాఖ్యకు కేటాయించాలన్నారు. మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, లాయక్‌అలీ, నర్సింహ, రాంచంద్రయ్య, నరేశ్‌యాదవ్, బుచ్చయ్య, కృష్ణయ్య, సాయిలు, కృష్ణ, మహేశ్, రాములు ఉన్నారు.

డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలోని సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని విరాట్‌నగర్‌లో పారిశుద్ధ్య కార్మికులు చేపడుతున్న పారిశుద్ధ్య పనులను కార్పొరేటర్ సుజాతనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు కనీస వసతులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువుల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న రత్నాకర్

మంచాల: పాడి పశువుల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సేవా ఫౌండేషన్ మేనేజర్ రత్నాకర్ పేర్కొన్నారు. మంగళవారం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరుట్ల గ్రామంలోని రైతు వేదిక భవనంలో పాడి పశువుల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషక విలువలు గల పచ్చిగడ్డి, దాణా పెట్టడం ద్వారా ఆరోగ్య వంతంగా ఉంటాయన్నారు. నట్టల నివారణా, పొదుగు వాపు వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలన్నారు. బలవర్ధక పోషకాలు పెట్టడం వల్ల పాలు ఎక్కువగా ఇస్తాయన్నారు. పశువుల షెడ్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైక్రో ల్యాబ్ మేనేజర్ శంకర్, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీనివాస్, ఆదర్శ రైతు ప్రతాప్‌రెడ్డి, మార సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

లింగోజిగూడ డివిజన్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

- సమస్యలను జెడ్సీ దృష్టికి తీసుకొచ్చిన కార్పొరేటర్

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ జంక్షన్‌లో ట్రాఫిక్‌ను మరింత మెరుగు పరిచాల్సిన అవసరం ఉందని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఎల్‌బీనగర్ జోనల్ కమిసర్, ఐఏఎస్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని అక్కడ వాల్ టూ వాల్ రోడ్డు వేయాలని సూచించారు. ఎల్‌బీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ద్వారం రహదారికి ఆనుకొని ఉండడం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాల వెనుక వైపు ఉన్న సీఎం రోడ్డులో మరో రెండు గేట్లను ఏర్పాటు చేయడంతో పాటు పిల్లల భద్రత కోసం సీసీ రోడ్డును నిర్మించాలని కోరారు. ఎల్‌బీనగర్ చౌరస్తాకు నాలుగు దిక్కులా ప్రయాణికులకు అనుకూలంగా మరుగు దొడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎల్‌బీనగర్‌లో రూ. 5బోజనం కోసం ఏర్పాటు చేసిన గ్రీల్డ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా ఉందని దానిని తొలగించి రోడ్డు వెడల్పు చేయాలని కోరారు. డివిజన్ పరిధిలో పలు కాలనీలలో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని కూడా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముంపు ప్రాంతాలలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు కార్పొరేటర్ తన దృష్టికి తీసుకొచ్చిన పలు ప్రతిపాదనలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీ జాకీయా సుల్తానా, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ విజయ్, నాయకులు శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్ యాదవ్

మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఏ ఆంక్షలు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 200 రోజులు కావొస్తున్న ఇప్పటివరకు రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కటి నెరవేర్చలేదన్నారు. అంతకు ముందు బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి యాదయ్యగౌడ్, బీజేపీ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు నర్ల శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు